హామీలను విస్మరించి మోసగిస్తున్న ప్రభుత్వం

- అతి తక్కువ కాలంలోనే ప్రభుత్వ వ్యతిరేకత
- ఎంపీ ఈటల రాజేందర్



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ అధ్యక్షతన నియోజకవర్గ కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వం రాగానే 2 లక్షల ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి విస్మరించారన్నారు. యువత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించిందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నిద్రపోమని నిరుద్యోగులు శపథం చేస్తున్నారని చెప్పారు. అనంతరం పలువురు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, సుభాష్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, పార్లమెంట్ ప్రభారి గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు పోతగాని గోపాల్‌గౌడ్, రాంప్రదీప్, జిల్లా కార్యదర్శి వెంకటాచలం, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, రవినాయక్, కార్పొరేటర్లు శ్రీవాణి, చైతన్య హరీష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో బాక్స్ డ్రైన్, సీసీ రోడ్ల ఏర్పాటు, పార్కుల సుందరీకరణ, కుక్కల బెడద, చెరువుల్లో పూడికతీతతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆలయంలో వరుణ హోమం

గౌతంనగర్: వరుణ దేవుడు కరుణించి పంటలు పండాలని, ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వరుణ హోమం, నర్సింహ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు రఘుకిరణాచార్యులు, వెంకటేశ్వరశర్మ, సీతారామశాస్త్రి, రాకేష్, వెంకటేశ్వర్ రావు, వెంకట సుధాకర్‌రావు, పవన్, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన సరే.. పనుల ప్రారంభమేది?



భూగర్భ డ్రైనేజీ పనుల నిర్మాణానికి తెచ్చిన పైపులు

- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకీకరణ పనుల్లో జాప్యం
- వర్షాకాలంలో పొంచి ఉన్న ముంపు ప్రమాదం

గౌతంనగర్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఉంది జ్యోతినగర్ కాలనీ భూగర్భ డ్రైనేజీ సమస్య. పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ముందుకు సాగకపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తరచూ ముంపు సమస్య తలెత్తుతుండటంతో భూగర్భ డ్రైనేజీ నీటి పారుదల వ్యవస్థ ఆధునీకరణ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

రూ.14 లక్షల వ్యయంతో..

సుమారు రూ.14 లక్షల వ్యయంతో 210 మీటర్ల పొడవున భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు జలమండలి అధికారులు టెండర్ ప్రక్రియ ముగించి 14.7 లక్షల రూపాయల పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు ముందుకు సాగలేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం అంటున్నారు కాలనీవాసులు.

ముంపు తప్పదా...

భూగర్భ డ్రైనేజీ ఆధునికీకరణతో ముంపు సమస్య పరిష్కారం అవుతుందని ఆశించిన కాలనీ వాసులకు నిరాశ తప్పడం లేదు.

అన్నపూర్ణ సొసైటీ, మహేంద్ర హిల్స్, జయగిరి లక్ష్మీనర్సింహస్వామినగర్, న్యూ వెంకటేశ్వరనగర్, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాల వర్షపు నీరు జ్యోతినగర్ కాలనీ మీదుగా వెళ్తుంది. పెద్ద వర్షం వచ్చిన ప్రతిసారి వరద ప్రభావం ఎక్కువ ఉండటంతో జ్యోతినగర్ కాలనీ ముంపునకు గురవుతుంది. భవిష్యత్‌లో సమస్య తలెత్తకుండా పాత డ్రైనేజీ తీసివేసి దాని స్థానంలో భూగర్భ డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచడానికి కొత్త పైపులైన్ వేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శంకుస్థాపన అనంతరం పనులు ప్రారంభించకపోవడంతో ఈ సారి వర్షాకాలంలో ముంపు సమస్య తప్పదా? అని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించాలని కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

జ్యోతినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఇటీవల ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగాయి. పనుల ప్రారంభానికి అన్ని రకాలు చర్యలు తీసుకుంటున్నాం.

- నవీన్, జలమండలి మేనేజర్

పనులు ప్రారంభించాలి



జ్యోతినగర్‌లో నెలకొన్న ముంపు సమస్య నివారణకు భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలి.

- మనోజ్, అధ్యక్షుడు, జ్యోతినగర్‌కాలనీ

కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి

అల్వాల్: కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు. అల్వాల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లో ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కాప్రా: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉద్యమకారుల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం గత ఆరేళ్లుగా పోరాడుతున్నామని తెలిపారు. ఎంతో మంది ఆత్మ బలిదానాలు, పోరాటాలు, త్యాగాలతో రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటిస్థలం , పెన్షన్ సౌకర్యాన్ని కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, ఉద్యమకారులు తాడూరి గగన్ కుమార్, దామరపల్లి నర్సింహారెడ్డి, కీర్తి శ్రీనివాస్, దొమ్మాటి కిరణ్‌కుమార్, దాసారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత

కాప్రా: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్రకృతిని కాపాడటం అందరి బాధ్యతని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కాప్రా డివిజన్ సైనిక్‌పురి పార్క్‌లో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుందారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బద్రొద్దీన్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలి



ప్లేట్లనందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ ప్రాథమిక పాఠశాలలో దేవీరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతారని, వారి కష్టానికి తగిన ఫలితంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థుల ఫీజును తామే చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బేతాళ బాలరాజు, కుమారస్వామి, రాజు, ఉపాధ్యాయులు సునీత, లక్ష్మీ ప్రసన్న, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే



మొక్క నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై సెట్విన్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

15న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 15వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోనున్నారు. జిల్లా కలెక్టర్ ద్వార ప్రత్యేకంగా అధికారం పొందిన ప్రత్యేక గెజిటెడ్ స్థాయి అధికారి ఈ ఎన్నికను నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫారం-3 ప్రకారం ఈ నెల 12వ తేదీన లేదా అంతకు ముందే మున్సిపల్ కార్పొరేషన్‌లోని సభ్యులకు నోటిఫికేషన్ విషయం తెలియజేయాలని వెల్లడించారు.

స్టీల్ బాటిల్స్ అందజేత



మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్టీల్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణ ప్రసాద్, నాచారం మహంకాళి చైర్మన్ కృష్టారెడ్డి, వీడీజీ ఇన్నారెడ్డి, కృష్టారెడ్డి, డీఎస్‌సీ శేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదానందం, స్టీల్ బాటిల్స్ డోనర్, జోన్ చైర్మన్ నందికొండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాంప్ కార్యాలయం కేటాయించండి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్కాజిగిరి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయం కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజుకు మంగళవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా ఆకుల రాజేందర్ ఉన్నప్పుడు మల్కాజిగిరి చౌరస్తాలో ఇందిరామహిళాభవన్ పేరిట భవన నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుతం ఆ భవనం రెండవ అంతస్తు ఖాళీగా ఉందని, ప్రజలకు అందుబాటులో ఉండడానికి కేటాయించాలని డీసీని కోరారు. కార్యక్రమంలో రాముయాదవ్, ఉపేందర్, ఉపేందర్‌రెడ్డి, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్, నవోదయనగర్ కాలనీకి చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు నమిళ్ల భాగ్యమ్మ మాదిగ ఉద్యమ వీరుల అవార్డు అందుకున్నారు. రవీంద్ర భారతిలో జరిగిన మాదిగ దండోర సదస్సులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్: మల్కాజిగిరి డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంగళవారం సైనిక్‌పురిలోని జలమండలి కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ అశోక్‌ను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పైపులైన్, బోర్ వెల్స్, నాలాలో పేరుకపోయి ఉన్న మురుగును ఎత్తివేయాలని కోరారు.

పోలీసుల తనిఖీలు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో తిష్టవేస్తున్న ఆకతాయిల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉప్పల్, రామాంతాపూర్ భగాయత్ లే అవుట్‌లో ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత భగాయత్‌లో సంచరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్వాల్: గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు కుషాయిగూడ ఏసీపీ ఆధ్వర్యంలో రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నేరెడ్‌మెట్ పోలీసులు, 30 మంది సిబ్బందితో కలిసి వినాయక్‌నగర్‌లోని వివిధ ప్రదేశాలు, రైల్వే ట్రాక్ వద్ద తనిఖీలు చేశారు.

జరిమానా.. జైలు శిక్ష

ఉప్పల్: చంగిచర్ల ప్రాంతానికి చెందిన డి. రామ్‌మోహన్(38), ఉప్పల్‌కు చెందిన వి. దేవేందర్(36), ఎల్బీనగర్‌కు చెందిన ఎం. శ్రీనివాస రాజు(45) ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా, ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్ మంగళవారం తెలిపారు. 11కేవీ గ్రీన్ పార్క్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గ్రీన్‌పార్క్, సాయిలీల ఎన్‌క్లేవ్, రామ్‌దాస్‌నగర్, ప్రశాంత్‌నగర్, శివపురి కాలనీకి సరఫరా నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

కుషాయిగూడలో...

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ -11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సీహెచ్ అర్చన తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని జీహెచ్ఎంసీ కాప్రా కార్యాలయం, మహేష్‌నగర్ పార్క్, మెయిన్‌రోడ్డు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు, కమలానగర్ పార్క్, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మేడిపల్లిలో...

11కేవీ వెంకటసాయి నగర్ ఫీడర్ 33/11కేవీ చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్నాహ్నం 12.30 గంటల వరకు ఎంఎల్ఆర్ కాలనీ, రాజేష్ నగర్, సాయి రెసిడెన్సీ, ప్రీవిలేజ్ కాలనీ, వెంకటసాయి నగర్, దత్తాత్రేయ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, నందిని నగర్, మహాగణపతి నగర్, కృష్ణానగర్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 33/11కేవీ చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో మధ్నాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఓల్డ్‌విలేజ్, రాజేష్ నగర్ ఫేజ్-3, క్రాంతి కాలనీ, ద్వారకానగర్, స్టాలిన్ కాలనీ, మల్లికార్జున నగర్, శివదుర్గ నగర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ హరినాథ్ తెలిపారు.

మల్లాపూర్‌లో...

11 కేవీ బెల్ ఫీడర్ పరిధిలోని మల్లాపూర్ పారిశ్రామిక వాడలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. స్వాగత్ కన్వెన్షన్ హాల్, బెల్ కంపెనీ, బొల్లిగూడ రోడ్, పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాను నిలి పివేస్తున్నట్లు తెలిపారు.

నాచారంలో...

నాచారం 11 కేవీ కాకతీయనగర్ ఫీడర్ పరిధి లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్తికేయనగర్, వీరారెడ్డినగర్, నాచారం మెయిన్ రోడ్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు.

బోడుప్పల్‌లో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా సూర్యాహిల్స్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు న్యూ రాంనగర్, కుమ్మరి కుంట, మెక్‌డాల్ కాలనీ, న్యూ హేమానగర్, వెస్ట్ బాలాజీ హిల్స్, పద్మావతి కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఉప్పల్: హబ్సీగూడ 11 కేవీ ఎన్‌జీఆర్ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హబ్సిగూడ మెయిన్ రోడ్డు, హబ్సీగూడ వీధి నంబర్ 3 నుంచి 7 వరకు, కాకతీయ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామి రెడ్డి తెలిపారు. అదేవిధంగా హబ్సీగూడ వీధి నంబర్- 8 జెన్ ప్యాక్ట్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు సర్వే కాలనీ, సర్వే ఆఫీస్, స్కైవాక్ జెన్ ప్యాక్ట్ ఎదురుగా గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నిఖిల్ తెలిపారు.

కమిషనర్ రాజీనామా చేయాలి



పీఎంసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావు రాజీనామా చేయాలని డిప్యూటీ మేయర్ కర్ర శివకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో తమ మనోభావాలను కించపరిచే విధంగా కమిషనర్ ప్రవర్తించారని కాంగ్రెస్ కార్పొరేటర్లు పీఎంసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సమావేశం ఉదయం 11 గంటలకు అని చెప్పి సమావేశం ప్రారంభించడంలో కమిషనర్ అలసత్వం వహించారన్నారు. ప్రజా ప్రతినిధులమని చూడకుండా గంటకు పైగా తమను పట్టించుకోకుండా అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్

సాక్షి ఎఫెక్ట్..



నాడు

రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు



నేడు

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అల్వాల్: మురుగు పారుతున్నా పట్టించుకోరా అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మార్కెట్‌లో కొద్ది రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి మార్కెట్ ప్రధాన రహదారి మురుగు నీటి మయంగా మారుతుంది. సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు ప్రారంభించారు. స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

కాప్రా: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకాలం నుంచి గులాబీ పార్టీ వెన్నంటే ఉన్న కాప్రా డివిజన్ సీనియర్ నాయకుడు సూడుగు మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు భేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు మేరకు ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడిగా పని చేశాడు. ఆయనతో పాటు మహిళా విభాగం అధ్యక్షురాలిగా పని చేసిన సురేఖ కూడా బీజేపీలో చేరారు.

కల్యాణోత్సవంలో కార్పొరేటర్

కుషాయిగూడ: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన అమ్మవారి కల్యాణ మహోత్సవంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



గోడను కుదించి రోడ్డును విస్తరించాలి



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ తదితరులు

ఉప్పల్: పిస్తా హౌస్ చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న పార్కు గోడను కుదించి రోడ్డును వెడల్పు చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులకు ఆదేశించారు. చిలుకానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలుకానగర్ బొడ్రాయి ప్రాంతంలో ఉన్న పురాతనమైన బావిలో చెత్తను తొలగించి ప్రహరీని ఏర్పాటు చేయాలన్నారు. బోడుప్పల్ నుంచి వచ్చే సివరేజ్ పైప్‌లైన్‌ను కావేరి కల్వర్టు వరకు వేయాల్సిందిగా ప్రతిపాదించారు. ఆదర్శనగర్ హిందూ శ్మశాన వాటికలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, డీఈ చందన పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో..

మల్కాజిగిరి: భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వివరాల ప్రకారం.. పీవీఎన్ కాలనీకి చెందిన ఆకుల రాజేందర్, కృష్ణకుమారి భార్యాభర్తలు. రాజేందర్ కారు డ్రైవర్‌గా, కృష్ణకుమారి(38) కాచిగూడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న రాజేందర్ తరచూ గొడవపడేవాడు. ఈ నెల 8వ తేదీన వారిద్దరికీ సర్దిచెప్పేందుకు అదే ప్రాంతంలో ఉన్న ఆమె అక్క జ్యోత్స్న, ఆమె భర్త వచ్చారు. ఆ సమయంలో కూడా కృష్ణకుమారిని రాజేందర్ కొట్టాడు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న కూతురిని మరుసటి రోజు ఉదయం రాజేందర్ తీసుకొచ్చాడు. తల్లిని నిద్ర లేపడానికి కూతురు ప్రయత్నించినా లేవలేదు. వెంటనే ఆమె పెద్దమ్మకు సమాచారం ఇచ్చింది. ఆమె వచ్చి చూసే సరికి కృష్ణకుమారి మృతి చెంది ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

గౌతంనగర్: 320-సీ లయన్స్ క్లబ్ ఆఫ్ మల్కాజిగిరి ఒలంపియాస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని క్లబ్ అధ్యక్షురాలు సుజాత అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ముగ్గురు పేద విద్యార్థులకు క్లబ్ తరపున ఫీజులను అందించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గవర్నర్ వెంకటనారాయణరెడ్డి, మొదటి జిల్లా గవర్నర్ ఇన్నారెడ్డి, ప్రతినిధులు కృష్టారెడ్డి, కొడిమెల హన్మంతరావు, రూపారెడ్డి, సుధా, భారతి, నరహింహరావు పాల్గొన్నారు.

సందర్శనార్థం అయోధ్య రాముడి విల్లు

కుషాయిగూడ: అయోధ్య రాముడి కోసం అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన విల్లును మంగళవారం కమలానగర్‌లోని సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. భక్తులు తరలివచ్చి విల్లును చూశారు. ఆలయ పూజారులు పూజలు చేశారు. విల్లు తయారీకి కిలో బంగారం, 14 కిలోల వెండితో సుమారు కోటి రూపాయలతో విల్లును తయారు చేసినట్లు అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాస్ శాస్త్రి, మల్క రమాదేవి, ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్ శర్మ, దిలీప్‌శర్మ, శంకర్‌పంతులు, సురేంద్ర, శంకరయ్య, జోషి, రామాచార్యులు పాల్గొన్నారు.

కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలి

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు బండారి రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న బండారి రవీందర్

మేడిపల్లి: కక్షపూరిత రాజకీయాలతో పేద ప్రజల ఇండ్లను కూల్చడం సరికాదని, అలాంటి రాజకీయాలకు స్వస్తి పలకాలని బీఆర్ఎస్ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు బండారి రవీందర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, నాయకులతో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లగానే అన్నీ మారుతాయా? అని ప్రశ్నించారు. ఆ స్థలాన్ని ప్లాట్లు చేసి అమ్మిన ఇద్దరు కూడా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారని, అమ్మిన వారే నేడు ఆ భూమిని సీలింగ్ ల్యాండ్ అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలు కుట్రపూరిత రాజకీయాలను గమనించి గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు హరిశంకర్ రెడ్డి, అనంతరెడ్డి, యుగేందర్ రెడ్డి, బచ్చరాజు, నాయకులు రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగుతూ వ్యక్తి మృతి

మల్లాపూర్: మద్యం తాగుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన గోపాల్ (55) మల్లాపూర్ చౌరస్తాలోని స్వర్ణ వైన్స్ వచ్చాడు. పర్మిట్ రూమ్‌లో మద్యం తాగుతూ ఒక్కసారిగా టెబుల్‌పై కుప్పకూలాడు. 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ వచ్చేసరికి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657